ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తమిళనాడు
TAMILNADU
గురువారం 18 ఏప్రిల్ 2024

కుంభకోణం రామస్వామి ఆలయంలో రథోత్సవం



చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా కుంభకోణంలో దక్షిణ అయోధ్యగా పేరుగడించిన రామస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా మహారథోత్సవం బుధవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆలయంలో సీతారాములు సోదర సమేతుడై కొలువుదీరి ఉంటారు. హనుమంతుడు మరెక్కడా లేని విధంగా ఓ చేతిలో వీణ, మరో చేతిలో రామాయణ గ్రంథాన్ని పట్టుకుని ఆశీనుడై భక్తులను దర్శనమిస్తారు. ఇంతటి కీర్తిని సంతరించుకున్న ఈ ఆలయాన్ని దక్షిణ అయోధ్యగా పిలుస్తున్నారు. ఈ ఆలయంలో ప్రతియేటా శ్రీరామనవమి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఆ మేరకు ఈ నెల తొమ్మిదిన ధ్వజారోహణంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలల్లో ప్రధాన ఘట్టమైన శ్రీరామనవమి మహారథోత్సవం బుధవారం ఉదయం వేలాది మంది భక్తుల నడుమ కనులపండువగా సాగింది.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఏజే శేఖర్, శ్రీ కృష్ణ తదితరులు

శ్రీవారి ఆలయంలో వేడుకగా నవమి ఆస్థానం



ప్రత్యేక అలంకరణలో సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి

ప్యారీస్, ఏప్రిల్ 17: స్థానిక టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులో ఉన్న శ్రీవారి ఆలయంలో బుధవారం శ్రీరామనవమి సందర్భంగా ఆస్థానం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు టీటీడీ సలహా మండలి అధ్యక్షులు ఏజే శేఖర్, డిప్యూటీ ఈవో ఆర్వీ విజయకుమార్, సూపరింటెండెంట్ సుమతి, మాజీ అధ్యక్షుడు ఎన్.శ్రీకృష్ణ సహా సభ్యులు మేళతాళాలతో పట్టువస్త్రాలు, ఫలాలను ఊరేగింపుగా ఆలయానికి తరలించారు. ప్రత్యేక వేదికపై సీతారామలక్ష్మణ హనుమంత స్వామివార్లను ఆస్థానం చేశారు. అనంతరం విశ్వక్సేన అంకురార్పణ, హోమ పూజ, వేద పారాయణం, మంగళవాయిద్యాలు, భక్తుల 'జై శ్రీరామ్' నామస్మరణల మధ్య మాంగల్యధారణ, మాలధారణ, ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్ రెడ్డి, సభ్యులు అనిల్‌కుమార్ రెడ్డి, పీవీఆర్ కృష్ణారావు, ఊరా లక్ష్మీనరసింహా రావు, శ్రీనివాసుల రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాధాకృష్ణ, మోహన్‌కుమార్, సుధాకర్ రెడ్డి, రంగా రెడ్డి, కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా టి.నగర్ జీఎన్ చెట్టి రోడ్డులోని పద్మావతి తాయారు ఆలయంలో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దర్శనానంతరం అందరికి లడ్డు ప్రసాదాలను పంపిణీ చేశారు. నవమి సందర్భంగా శ్రీవారు, పద్మావతి అమ్మవారి ఆలయాలను పూలు, తోరణాలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.



వీరరాఘవ పెరుమాళ్ ఆలయంలో గరుడోత్సవం

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అష్టోత్తర శత వైష్ణవక్షేత్రాల్లో ఒకటైన తిరువళ్లూరు వైద్య వీరరాఘవ పెరుమాళ్ ఆలయంలో చిత్తిరై ఉత్సవాల్లో భాగంగా స్వామివారు బుధవారం ఉదయం గరుడవాహనంపై ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ ఆలయంలో వార్షిక చిత్తిరై ఉత్సవాలు ఈ నెల 15న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ స్వామివారు ఇష్టదేవేరులైన భూదేవి, శ్రీదేవీ సమేతులై వివిధ వాహనాల్లో ఆలయ మాడ వీధుల్లో ఊరేగారు. ఈ నేపథ్యంలో బుధవారం స్వామివారి గరుడసేవ అత్యంత వైభవంగా జరిగింది. ఈ గరుడోత్సవంలో తిరువళ్లూరు, కాంచీపురం, చెన్నై, పూందమల్లి, తిరుత్తణి, ఆవడి, ఊత్తుకోట, సత్యవేడు తదితర ప్రాంతాల నుండి విచ్చేసిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

68,321 పోలింగ్ బూత్‌లు

శుక్రవారం జరిగే పోలింగ్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 68321 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కోసం 1,59,100 ఈవీఎంలు, 82014 కంట్రోల్ యంత్రాలు, 88783 వీవీ ప్యాట్‌లను ఉపయోగిస్తున్నారు. పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వీలుగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల వద్ద మూడంచెల భద్రత కల్పించి, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు.



రామనాథపురంలోని ఓ చిన్నహోటల్‌లో కేక్ తింటూ ప్రచారం చేస్తున్న ఓ.పన్నీరుసెల్వం

మూగబోయిన మైకులు

- ముగిసిన ప్రచార పర్వం
- రేపటి పోలింగ్‌కు యంత్రాంగం సన్నద్ధం

అడయార్, ఏప్రిల్ 17: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసింది. బుధవారం సాయంత్రం 6 గంటలకు మైకుల మూగబోయాయి. అన్ని పార్టీల నేతలు ప్రచారాన్ని ముగించారు. డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ నగరంలోను, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి సేలంలోను తమతమ ఎన్నికల ప్రచారాన్ని ముగించారు. కాగా శుక్రవారం ఉదయం 7 గంటలకు ఎన్నికల పోలింగ్ ప్రారంభం కానుంది. సార్వత్రిక ఎన్నికల సమరంలో భాగంగా ఈ నెల 19న తొలి దశ పోలింగ్ జరుగనుంది. ఈ దశలో రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు, పుదుచ్చేరిలోని ఒక ఎంపీ సీటుకు ఒకేసారి పోలింగ్ నిర్వహించనున్నారు. తొలి దశలో దేశ వ్యాప్తంగా మొత్తం 102 స్థానాలకు పోలింగ్ జరుగనుంది. ఈ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని 'ఇండియా' కూటమి, అన్నాడీఎంకే నేతృత్వంలోని కూటమి, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమితో పాటు మరికొన్ని చిన్న చన్న పార్టీలు తమతమ అభ్యర్థులను పోటీలో దింపాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 950 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు తేల్చనున్నారు. తమ పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, డీపీఐ ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్, పీఎంకే అగ్రనేతలు డాక్టర్ రాందాస్, డాక్టర్ అన్బుమణి, డీఎండీకే అధ్యక్షురాలు ప్రేమలత, ఎంఎన్‌ఎం అధ్యక్షుడు కమల్ హాసన్, నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్ ఇలా అన్ని పార్టీల నేతలు క్షేత్రస్థాయిలో ప్రచారం చేశారు. అలాగే పోటీలో ఉన్న అభ్యర్థులు సైతం తమ విజయం కోసం మండుటెండను సైతం లెక్కచేయకుండా విస్తృతంగా ప్రచారం చేశారు. మరోవైపు ఈ ఎన్నికల్లో మొత్తం 6,23,33,925 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



సభకు హాజరైన జనం

మోదీ వసూల్ రాజా

- ఎన్నికల బాండ్లతో బయటపడ్డ అవినీతి ముఖం
- బీసెంట్‌నగర్ ప్రచార సభలో స్టాలిన్



బీసెంట్‌నగర్ ప్రచార సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీని ప్రవేశపెట్టి బియ్యం, పప్పు తదితర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగేందుకు ప్రధాని నరేంద్రమోదీ కారణమయ్యారని, రాష్ట్రాల హక్కులను హరించి విపరీతంగా పన్నులు విధించి అధిక రాబడి పొందే వసూలు రాజాగా పేరు తెచ్చుకున్నారని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విమర్శించారు. బీసెంట్‌నగర్‌లో బుధవారం సాయంత్రం సెంట్రల్ చెన్నై అభ్యర్థి దయానిధి మారన్, సౌత్ చెన్నై అభ్యర్థి తమిళచ్చి తంగపాండ్యన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఇండియా కూటమి చేస్తున్న ద్వితీయ స్వాతంత్ర్య సంగ్రామంగా పరిగణించాలన్నారు. అన్నాదురైని ఎంపీగా చేసిన దక్షిణచెన్నై, డీఎంకే సిద్ధాంత కర్త మురసొలిమారన్ గెలిచిన సెంట్రల్ చెన్నై డీఎంకే అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. పదేళ్లుగా ప్రజాసంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన బీజేపీ ప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రాలను మున్సిపాలిటీలుగా మార్చేందుకు కుట్రపన్నుతోందని, దేశాన్ని ప్రతిపక్షాల రహితంగా మార్చేందుకు మోదీ కంకణం కట్టుకున్నారని దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే ఓటమి తథ్యమని తెలియడంతో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే కాంగ్రెస్, వామపక్షాల బ్యాంక్ అకౌంట్లను స్తంభింపజేసి మోదీ నిరంకుశత్వాన్ని ఎలుగెత్తి చాటారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేసిన ఏడు పథకాలలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని కాగ్ నివేదిక సమర్పిస్తే ఆ సంస్థలో పనిచేస్తున్న ముగ్గురిపై మోదీ బదిలీవేటు వేశారని స్టాలిన్ ఆరోపించారు. ఏటా రెండు లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చిన మోదీ పదేళ్లలో ఎవరికీ ఉద్యోగాలివ్వకపోవడంతో పాటు .. పర్మినెంట్ ఉద్యోగాలను సైతం పార్ట్ టైమ్‌గా మార్చిపడేశారన్నారు. ఆధ్యాత్మికానికి తామే ఆద్యులమంటూ గొప్పలు చెప్పుకునే బీజేపీ పాలకులు కర్పూరంపై 15 శాతం పన్ను, అగరవత్తులపై ఐదు శాతం పన్ను విధించడం న్యాయమేనా అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం అమలు చేసిన జీఎస్టీ రాష్ట్రాలకు చెందిన ఆదాయ వనరులను కొల్లగొట్టే పన్నులా ఉండటంతో ఉత్తరాదికి చెందిన వారంతా జీఎస్టీని గబ్బర్‌సింగ్ టాక్స్ అంటూ యెద్దేవా చేస్తున్నారన్నారు. ఎన్నికల బాండ్ల కుంభకోణంలో పీకలదాకా కూరుకుపోయిన ప్రధాని మోదీ అవినీతి ముఖం దేశమంతటా వెల్లడై కలకలం సృష్టిస్తోందన్నారు. అవినీతికంటూ ప్రత్యేక విశ్వవిద్యాలయం ఉంటే దాని ఛాన్సలర్ పదవికి మోదీ అన్ని విధాలా అర్హుడంటూ స్టాలిన్ చెణుకు విసిరారు. ఈ సభలో రాష్ట్రమంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్ బాబు, మయిలై వేలు, సిట్రరసు, కాంగ్రెస్ నేత పీటర్ ఆల్ఫోన్స్, సీపీఎం నేత రామకృష్ణన్, ఆమ్ ఆద్మీ కార్యదర్శి వశీకరన్, రాజ్యసభ సభ్యులు విల్సన్, ఇళంగో తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సెలవుల ఎఫెక్ట్!

ఒకే రోజు రూ.400 కోట్ల మద్యం విక్రయాలు ● ఇళ్లల్లో స్టాక్ పెట్టుకున్న మందుబాబులు



చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా టాస్మాక్ దుకాణాల్లో మద్యం విక్రయాలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. ఒకే రోజు రాష్ట్రమంతటా రూ.400 కోట్ల మేర మద్యం విక్రయించినట్లు టాస్మాక్ ఉన్నతాధికారులు ప్రకటించారు. రాష్ట్రంలో ఈ నెల 19న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నిర్వహించడం కోసం బుధవారం నుంచి శనివారం వరకు టాస్మాక్ దుకాణాలకు సెలవు ప్రకటించారు. దీంతో మద్యం ప్రియులు మంగళవారం టాస్మాక్ దుకాణాలకు పోటెత్తి మూడు రోజులకు సరిపడా మద్యం కొనుగోలు చేశారు. టాస్మాక్ నిబంధనల ప్రకారం ఒక్కో వ్యక్తికి ఓ బీరు, మూడు క్వార్టర్ బాటిల్స్ మద్యం విక్రయించాల్సి ఉంది. అయితే మంగళవారం మందుబాబులు విడతలవారీగా బీర్లు, మద్యం సీసాలు కొని ఇళ్ళకు తీసుకెళ్ళారు. కొంతమంది మద్యపాన ప్రియులు షాపుల వద్దే మద్యం తాగి, మూడు రోజులకు సరిపడా మద్యం, బీర్ కొనుగోలు చేసి ఇళ్లకు చేరారు. సాధారణంగా రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలలో రోజూ రూ.150 కోట్ల మేరకు మద్యం విక్రయాలు జరుగుతాయి.. అయితే మంగళవారం రెండున్నర రెట్లు అమ్మకాలు పెరిగి సుమారు రూ.400 కోట్ల మేర మద్యాన్ని విక్రయించినట్లు టాస్మాక్ అధికారులు వెల్లడించారు. ఇక నగరంలోనూ, సమీప జిల్లాలైన తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లోనూ మంగళవారం మద్యం విక్రయాలు విపరీతంగా పెరిగాయి. చెన్నై సహా నాలుగు జిల్లాల్లో నాలుగింతల మద్యం విక్రయాలు జరిగినట్లు టాస్మాక్ అధికారులు పేర్కొన్నారు. ఇక లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత శనివారం తెరచుకోనున్న టాస్మాక్ దుకాణాల్లో మళ్ళీ మద్యం అమ్మకాలు అధికమవుతాయని అధికారులు చెబుతున్నారు. ఆదివారం మహావీర్ జయంతి సందర్భంగా మద్యం దుకాణాలకు సెలవు ప్రకటించడంతో శనివారమే మందుబాబులు ఆదివారం కోసం మద్యం కొనే అవకాశాలున్నాయని పేర్కొంటున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో జర జాగ్రత్త

- అన్నాడీఎంకే ఏజెంట్లకు ఎడప్పాడి సూచన



సేలంలో పళనిస్వామి ప్రచారం

ప్యారీస్, ఏప్రిల్ 17: పోలింగ్ కేంద్రాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలంటూ అన్నాడీఎంకే ఏజెంట్లకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి హితవు పలికారు. బుధవారం సేలంలో ప్రచారం చేపట్టిన ఆయన ప్రసంగిస్తూ... ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లతో సన్నిహితంగా మెలగాలని, ముఖ్యంగా పోలింగ్ నమోదు ప్రక్రియను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య పండుగగా జరుపుకుంటున్న లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటేసే విధంగా పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు తమ తమ ప్రాంతాల్లో సైనికుల్లా పనిచేయాలని, ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం తగదని సూచించారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు ముమ్మరం

- నేడు కేంద్రాలకు తరలింపు
- 1.90లక్షల మంది పోలీసులతో ఎన్నికల బందోబస్తు
- నగరంలో 708 పోలింగ్ కేంద్రాల్లో పారామిలటరీ దళాలు



సామగ్రి సిద్ధం చేస్తున్న సిబ్బంది

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి సహా 40 లోక్‌సభ నియోజకవర్గాల్లో శుక్రవారం జరుగనున్న పోలింగ్ కోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. అంతేగాక ఆయా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై ఎన్నికల అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రమంతటా 1.90లక్షల మంది పోలీసులతో పటిష్ఠమైన భద్రత కల్పించనున్నారు. రాజధాని నగరం చెన్నైలో 708 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవి కావడంతో ఆ కేంద్రాల వద్ద పోలీసులతో పాటు పారామిలటరీ దళాలతో భద్రతను పటిష్ఠం చేయనున్నారు. ఎన్నికల నిర్వహణ అధికారులు పోలింగ్ ముందస్తు పనుల్లో నిమగ్నమయ్యారు. పోలింగ్ కేంద్రాల్లో డ్యూటీ సిబ్బంది పోలింగ్ సామగ్రిని గురువారం ఉదయం తరలించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. అదే సమయంలో పోలీసు ఉన్నతాధికారులు కూడా పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. బుధవారం సాయంత్రం ఆరుగంటల నుంచి రాష్ట్రంలో లాడ్జీలు, మేన్షన్లు, రెస్టారెంట్లు, హోటళ్ళలో బసచేస్తున్న స్థానికేతరులను వెళ్లిపోవాలని పోలీసులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధంలేని వ్యక్తులను గుర్తించి వారిని స్వస్థలాలకు పంపే ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 63,321 పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తుకు 1.90ల లక్షల మంది పోలీసులు తమకు కేటాయించిన ప్రాంతాలకు బయలుదేరి వెళ్ళారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల నుండి రప్పించిన పది వేల మంది పోలీసులు కూడా ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. వీరితోపాటు పారామిలటరీ దళాలు, మాజీ సైనికులు, హోంగార్డులు కూడా ఎన్నికల భద్రతా విధుల్లో పాలుపంచుకోనున్నారు.

190 పారామిలటరీ దళాలు...

రాష్ట్ర వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలకు పటిష్ఠమైన భద్రత కల్పించేందుకు 200 కంపెనీల పారామిలటరీ దళాలు కేటాయించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసింది. అయితే ఇప్పటి వరకు 190 కంపెనీలు మాత్రమే రాష్ట్రానికి వచ్చాయని ఎన్నికల అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా 10 కంపెనీల పారామిలిటరీ దళాల బుధవారం సాయంత్రం నగరానికి చేరుకున్నాయని, వారిని సమీప జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాలకు తరలించనున్నామని ఎన్నికల అధికారులు తెలిపారు.

8050 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు..

ఇక రాష్ట్రంలో 8050 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. నగరంలో 708 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలున్నాయని చెన్నై జిల్లా ఎన్నికల నిర్వహణాధికారి డాక్టర్ జే రాధాకృష్ణన్ తెలిపారు. మదురైలో 511 పోలింగ్ కేంద్రాలు, తేనిలో 381 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించి, పారామిలిటరీ దళాలతో అదనపు భద్రత కల్పిస్తారు.

నేడు పోలింగ్ సామగ్రి తరలింపు..

రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలకు గురువారం ఉదయం నుంచి సామగ్రిని తరలించనున్నారు. బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు శాసనసభ నియోజకవర్గాలవారీగా ఎన్నికల విధులు నిర్వర్తించనున్న సిబ్బందికి పోలింగ్‌కు అవసరమైన సామగ్రిని అందించారు. ఇదే విధంగా ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, సిరా, ఓటర్ల జాబితా పుస్తకాలు తదితర సామగ్రిని గురువారం సాయంత్రం లోగా నగరంలోని 3726 పోలింగ్ కేంద్రాలకు 450 వాహనాల్లో తరలించనున్నట్లు చెన్నై జిల్లా ఎన్నికల నిర్వహణాధికారి డాక్టర్ జే రాధాకృష్ణన్ తెలిపారు.

సమాచార దర్శిని

వేసవి ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓటు వేసేందుకు స్వగ్రామాలకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం చెన్నై సెంట్రల్-వైట్ ఫీల్డ్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06005 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-వైట్ ఫీల్డ్ ప్రత్యేక రైలు ఈ నెల 18,20 తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 5.35 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు వైట్ ఫీల్డ్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06006 వైట్ ఫీల్డ్-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 18,20 తేదీల్లో మధ్యాహ్నం 1 గంటకు వైట్‌ఫీల్డ్‌లో బయల్దేరి రాత్రి 7 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. ఈ రైళ్లు పెరంబూర్, అరక్కోణం, వాలాజా రోడ్డు, కాట్పాడి, జోలార్‌పేట, కుప్పం, బంగారుపేట స్టేషన్‌లలో ఆగుతాయి.

రేపు కోయంబేడు మార్కెట్‌కు సెలవు

ఐసిఎఫ్, ఏప్రిల్ 17: స్థానిక కోయంబేడు మార్కెట్‌కు శుక్రవారం సీఎండీఏ సెలవు ప్రకటించింది. ఈ మార్కెట్‌లో వివిధ జిల్లాలకు చెందిన వ్యాపారులు ఇక్కడ వ్యాపారం చేస్తున్నారు. వారికి సొంతూళ్లలో ఓటు హక్కు ఉండడంతో గురువారం ఉదయం 11 గంటలకే వ్యాపారాలు ముగించుకొని వెళ్లనున్నారు. ఈ కారణంగా పోలింగ్ రోజైన 19వ తేది దుకాణాలు మూసివేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రేపు వండలూరు జూకు సెలవు

ఐసిఎఫ్, ఏప్రిల్ 17: స్థానిక వండలూరు జూలాజికల్ పార్క్‌కు ఈ నెల 19వ తేది సెలవు ప్రకటించారు. సుమారు 2 వేలకు పైగా జంతువులు, పక్షులు, సరీసృపాలున్న ఈ జూను చూసేందుకు పిల్లలతో పాటు పెద్దలు వస్తుంటారు. వారంతపు, సెలవు రోజుల్లో జూకు వచ్చే పర్యాటకుల సంఖ్య అధికంగ ఉంటుంది. ఈ నేపథ్యంలో, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా శుక్రవారం జూకు సెలవు ప్రకటిస్తున్నట్లు అధికారులు ప్రకటన విడుదల చేశారు.

నేటినుంచి మద్రాస్ మెషీన్ టూల్స్ ప్రదర్శన

ఐసిఎఫ్, ఏప్రిల్ 17: మద్రాసు మెషీన్ టూల్స్ తయారీ దారుల సంఘం అంతర్జాతీయ యాంత్రిక పరికరాల ప్రదర్శన చెన్నై వాణిజ్య కేంద్రంలో గురువారం నుంచి 23వ తేది వరకు నిర్వహించనుంది. మెషనింగ్ సెంటర్, డ్రిల్లింగ్ మెషీన్స్, గ్రైండిగ్ మెషీన్స్ సహా వివిధ రకాల కొత్త తయారీ ప్రదర్శించనున్నారు. ఈ ప్రదర్శన నెట్ వర్కింగ్, అవకాశాలకు నెలవుగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

21, మే 1న మద్యం దుకాణాలకు సెలవు

ఐసిఎఫ్, ఏప్రిల్ 17: మహావీర్ జయంతి (ఈ నెల 21వ తేది), మే 1వ తేది (మే డే) పురస్కరించుకొని చెన్నై జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలను మూసివేయాలని కలెక్టర్ ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయించే వారిపై చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ హెచ్చరించారు.

ఎన్‌ఎల్సీలో జేఈ, అసిస్టెంట్ పోస్టులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 17: నైవేలీ నేలబొగ్గు సంస్థ (ఎన్ఎల్సీ)లో జూనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ పోస్టులకు అర్హులైన వారు ఈ నెల 24వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ సంస్థలో ఖాళీగా ఉన్న ఇండస్ట్రియల్ వర్కర్, డ్రాఫ్ట్‌మెన్,ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిల్, వైర్ మెన్, క్లరికల్ అసిస్టెంట్, జూనియర్ ఇంజనీర్ తదితర పోస్టులకు ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ చేసిన 30ఏళ్లలోపున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 'ఎన్‌ఎల్సీ ఇండియా' వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

జూ అంబాసిండర్‌గా విద్యార్థులకు అవకాశం

ఐసిఎఫ్, ఏప్రిల్ 17: వండలూరు జులాజికల్ పార్క్ నిర్వాహకులు విద్యార్థులకు 'జూ అంబాసిడర్' పథకాన్ని పరిచయం చేశారు. 5వ తరగతి, ఆపై చదివే విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. విద్యార్థులు వివిధ రకాల వన్యమృగాల గురించి తెలుసుకొనేలా వేర్వేరుగా క్షీరదాలు, పక్షులు, సరీసృపాలు, సీతాకోక చిలుకలు, పార్కుల పనితీరు వంటివి తెలుసుకుంటారు. విద్యార్థులకు వెటర్నరీ వైద్యులు, జువాలజిస్టులు, అటవీ శాఖ అధికారులు సలహాలు, సూచనలిస్తారు. ప్రతిరోజు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు మూడు రోజులు ఈ శిబిరం నిర్వహించనున్నారు. ఇతర వివరాలు, పేరు నమోదుకు www.aazp.tn/summer-camp2024/ అనే వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

మద్రాసు హైకోర్టులో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఏప్రిల్ 17: మద్రాసు హైకోర్టు ఆధ్వర్యంలోని పుదుచ్చేరి జిల్లా కోర్టుల్లో ఖాళీగా ఉన్న టైపిస్ట్, క్లర్క్, స్టెనో తదితర పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్లస్ టూ ఉత్తీర్ణతతో పాటు తమిళం, ఆంగ్లంలో జూనియర్, సీనియర్ గ్రేడ్ టైపింగ్ పూర్తిచేసుకొని 18 నుంచి 32 ఏళ్లలోపున్న వారు అర్హులు. దరఖాస్తు రుసుము రూ.750కి 'రిజిస్టర్ జనరల్, హైకోర్టు' పేరుతో డీడీ తీయాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు దరఖాస్తు రుసుము లేదు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23వ తేది వరకు https://www.mhc. tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో ప్రొఫెసర్ పోస్టులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 17: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 4,000 ప్రొఫెసర్ పోస్టులను టీఆర్బీ భర్తీ చేయనుంది. భాషా అధ్యాపకులతో పాటు బోటనీ, కెమిస్ట్రీ, బయో టెక్నాలజి, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, ఎన్విరాల్‌మెంటల్ సైన్స్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, సోషియాలజీ తదితర శాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులకు పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, వచ్చే జూలై నాటికి 50 ఏళ్లలోపున్న వారు ఈ నెల 29వ తేదిలోపు టీఆర్బీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

రేపు థియేటర్లలో రెండు షోలు రద్దు

ఐసిఎఫ్, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా శుక్రవారం (ఈనెల 19వ తేది) రాష్ట్రంలోని సినిమా థియేటర్లలో పగటి షోలు రద్దు చేశారు. రాష్ట్రంలోని 1,168 సినిమా థియేటర్లలో మార్నింగ్, మ్యాట్నీ షోలు రద్దు చేసినట్లు థియేటర్ల యజమానుల సంఘం ప్రకటన విడుదల చేసింది. ఆ రోజున సాయంత్రం, రాత్రి షోలు యధావిధిగా ప్రదర్శించనున్నట్లు సంఘం తెలియజేసింది.

22 వరకు సెంథిల్ బాలాజి రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 17: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ రిమాండ్‌ను 33వ సారి న్యాయస్థానం పొడిగించింది. చట్టవ్యతిరేక నగదు మార్పిడి నిరోధక చట్టం కింద గత ఏడాది జూన్ 14వ తేది ఈడీ అధికారులు అరెస్ట్ చేసిన సెంథిల్ బాలాజీని రిమాండ్ నిమిత్తం పుళల్ జైలుకు తరలించారు. ఆయన రిమాండ్ గడువు బుధవారంతో ముగియడంతో జైలు నుంచే ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, ఆయన రిమాండ్‌ను ఈ నెల 22వ తేది వరకు పొడిగిస్తున్నట్లు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.






సీతారామ్ నగర్‌లో సీతారాములను పురవీధుల్లో సంప్రదాయబద్ధంగా ఊరేగిస్తున్న తెలుగు వారు - రామ్ నగర్ కల్యాణోత్సవంలో నిర్వాహకులు - ఆంధ్ర కళా స్రవంతి కల్యాణోత్సవంలో ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామివార్లు - హాజరైన తెలుగు వారు

కల్యాణం-కమనీయం

● తెలుగు లోగిళ్లలో వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

ప్యారీస్, ఏప్రిల్ 17: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా బుధవారం రాజధాని నగరం చెన్నైలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. కోదండరామయ్య కల్యాణ ఘట్టాన్ని వేదపండితులు, పురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెలుగు లోగిళ్లను అరటి, మామిడి తోరణాలు, పూలతో అలంకరించడంతో పండుగ వాతావరణం వెల్లివిరిసింది. సీతారాములను అలంకరించి పల్లె వాతావరణం తలపించేలా పురవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు. తెలుగు సంప్రదాయం, సంప్రదాయ వస్త్రధారణ, తెలుగు వంటకాలు, వడపప్పు, పానకం, ప్రసాదాల పంపిణీ, చదివింపులు తదితర కార్యక్రమాలతో తెలుగు సంస్థల్లో సందడి నెలకొంది.

సీతారామ్‌నగర్‌లో...

ఉత్తర చెన్నై కొడుంగైయూర్ సమీపంలోని సీతారామనగర్ తెలుగు ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం సంఘ కార్యాలయ ప్రాంగణంలో వైభవంగా జరిగింది. అధ్యక్షుడు బి.సురేష్‌బాబు, కార్యదర్శి పి.లక్ష్మణరావు, కోశాధికారి డి.పిచ్చేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, ఎ.దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శులు కె.శ్రీనివాస కుమార్, బి.శ్రీధర్, కమిటీ సభ్యులు జె.మధుసూదనరావు, పి.బాలాజి, సీఎస్ జయకుమార్, టి.నాగరాజు, టి.సాంబశివరావు, ఎన్.సతీష్ కుమార్, పి.సుబ్బరాజు, డి.వినోద్ కుమార్ తమ కుటుంబసభ్యులతో కలసి సీతారాములను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం సంఘ భవనంలో మధ్యాహ్నం కల్యాణం నిర్వహించి తెలుగు వంటకాలతో విందు ఏర్పాటుచేశారు.



అక్షయబాబా మందిరంలో సీతారాముల కల్యాణోత్సవంలో అజంతా శంకరరావు, ఎంవీ నారాయణ గుప్తా తదితరులు

రామ్ నగర్‌లో...

ట్రిప్లికేన్‌లోని రామ్ నగర్‌లో ఆది ఆంధ్ర సంక్షేమ సంఘం పెద్దలు, కోదండ రామ భక్త భజన బృందం, రామదాసాంజనేయ స్వామి, ఎమ్మార్పీఎస్ తమిళనాడు నిర్వాహకులు సంయుక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజన కార్యక్రమాల్లో రామ్ నగర్ ప్రజలు పాల్గొన్నారు.

ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు.

ఆంధ్ర కళా స్రవంతిలో...

కొరట్టూరు అగ్రహారంలోని కోదండ రామాలయంలో ఆంధ్ర కళా స్రవంతి ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సీతారామ కల్యాణ మండపంలో వేదపండితులు పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తుల సమక్షంలో కల్యాణాన్ని జరిపించారు. సంస్థ అధ్యక్షుడు జేఎం నాయుడు, సలహాదారు ఎంఎస్ మూర్తి, కార్యదర్శి జె.శ్రీనివాస్, కోశాధికారి జీవీ రమణ, ఇతర సభ్యులతో కూడిన కమిటీ ఈ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఐదుగురు దంపతులు పెళ్లి పెద్దలుగా పాల్గొన్నారు.

మద్రాసు మిర్చి వర్తక సంఘంలో...

జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి కన్వెన్షన్ హాలులో మద్రాసు మిర్చి వర్తక సంఘం ఆధ్వర్యంలో సీతారామ కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం వెంకటేశ్వర సుప్రభాతం, భక్తిగీతాల ఆలాపన అనంతరం పురోహితులు వడ్డి వెంకటేశ్వర శాస్త్రి సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు మిరియాల మాధవయ్య, ఉత్సవ కమిటీ చైర్మెన్ వి.ధనుంజయ నాయుడు, నిర్వాహకులు ఎస్.భాస్కర్, ఎస్.శివకుమార్, ఎస్.సురేష్, ఎస్కే హిమామ్ భాషా, ఎ.రాంబాబు, ఎస్.బాలసుబ్రమణ్యం, ఎ.ప్రభాకరన్, ఎన్.జనార్థన్, ఎస్.శ్రీనివాసులు, పి.గిరిధర్, మూర్తి చెన్నకేశవులు. ఇతర సభ్యులు పాల్గొన్నారు.



మద్రాసు మిర్చి వర్తక సంఘం ఆధ్వర్యంలో రాములోరి కల్యాణోత్సవం

అక్షయబాబా మందిరంలో...

బ్రాడ్‌వే ఆచారప్పన్ వీధిలోని అక్షయబాబా మందిరంలో నిర్వహించిన సీతారాముల కల్యాణం భక్తులను పులకింపజేసింది. ఉదయం 10.30 గంటల నుంచి కల్యాణోత్సవాన్ని జై వాసవి సాయి ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అజంతా అధినేత డా.కనిగెలుపుల శంకరరావు, విజయలక్ష్మి దంపతులు, కోశాధికారి డా.ఎంవీ నారాయణ గుప్తాల పర్యవేక్షణలో నిర్వహించారు. ముత్తయిదువులకు పసుపు కుంకుమలు, భక్తులకు అన్నతీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఎస్ మహేంద్రబాబు, కనిగెలుపుల రాధాకృష్ణమూర్తి, పీబీ శ్రీధర్‌లు తమ కుటుంబ సభ్యులతో కలసి పాల్గొని, దైవదంపతులను సేవించారు.

కసి - పట్టుదలతో చదివా

● సివిల్స్ విజేత ఇన్బ



అడయార్, ఏప్రిల్ 17: తన కుటుంబం పేదరికాన్ని జయించేందుకు కసి, పట్టుదలతో చదివి సివిల్స్ పరీక్షలకు హాజరయ్యాయని, ఆ కష్టానికి ఫలితం దక్కిందని సివిల్స్ విజేత ఇన్బ తెలిపారు. మంగళవారం విడుదలైన యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో తెన్‌కాశి జిల్లా సెంగోట్టైకు చెందిన ఇన్బ (25) అనే యువతి విజయం సాధించి జాతీయ స్థాయిలో 851వ ర్యాంకు సొంతం చేసుకుంది. ఈ సక్సెస్‌పై ఆమె స్పందిస్తూ, పదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివానని, ప్లస్1, ప్లస్2 సెంగోట్టైలో పూర్తి చేసినట్టు వెల్లడించారు. కోయంబత్తూరులోని సీఐటీ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసినట్టు చెప్పారు. బీటెక్ పూర్తి చేసిన వెంటనే చెన్నైలోని శంకర్ ఐఏఎస్ అకాడెమీలో శిక్షణ తీసుకుంటూ సివిల్స్‌కు సిద్ధమైనట్టు వివరించారు. ప్రిలిమ్స్‌లో రెండు సార్లు హాజరైనా ఉత్తీర్ణత కాలేదన్నారు. మూడోసారి విజయం సాధించి, మెయిన్స్‌కు చెన్నైలోని రాష్ట్ర ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఇనిస్టిట్యూట్‌లో ఐఏఎస్ పరీక్షకు సిద్ధమైనట్టు తెలిపారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో 851 ర్యాంకు రావడం సంతోషంగా ఉందన్నారు. తమ కుటుంబం పేదరికంలో ఉందని, దీన్ని జయించాలన్న ఏకైక లక్ష్యంతో కఠోరంగా శ్రమించి సక్సెస్ సాధించినట్టు పేర్కొన్నారు.

రిజిస్ట్రార్ నియామకం వ్యవహారం.. అన్నా వర్సిటీ ఉన్నత విద్యాశాఖకు హైకోర్టు నోటీసులు

పెరంబూర్, ఏప్రిల్ 17: రిజిస్ట్రార్ నియామకానికి సంబంధించి అన్నా విశ్వవిద్యాలయ ఉన్నత విద్యాశాఖ బదులు పిటిషన్ వేయాలని మద్రాసు హైకోర్టు నోటీసు జారీచేసింది. ఈ వర్శిటీ రిజిస్ట్రార్‌గా ప్రకాష్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ డీఎంకే ఎమ్మెల్యే పరంధామన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై బుధవారం విచారించిన న్యాయస్థానం, వర్సిటీ సిండికేట్ సమావేశ వీడియో వివరాలు భద్రపరచాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణ జూన్ 7వ తేదీకి వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

39 నియోజకవర్గాల్లో 8,400 తపాలా ఓట్లు నమోదు

పెరంబూర్, ఏప్రిల్ 17: రాష్ట్రంలోని 39 లోకసభ నియోజకవర్గాల్లో 8,400 తపాలా ఓట్లు పోలయ్యాయి. ఈ నియోజకవర్గాల పోలింగ్ శుక్రవారం జరుగనుండగా, పోలింగ్ ప్రశాంతంగా సాగేలా ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు తపాలా ఓటు హక్కు వినియోగించుకొనేలా ఈసీ చర్యలు చేపట్టింది. పోలింగ్ కేంద్రాలకు రాలేని 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు కూడా తపాలా ఓటు అవకాశం కల్పించింది. ఆ ప్రకారం 39 నియోజకవర్గాల్లో ఇప్పటివరకు 8,400 తపాలా ఓట్లు పోలవ్వగా, అత్యధికంగా తిరుచ్చి లోక్‌సభ నియోజకవర్గంలో 3,369 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారులు తెలిపారు.

నేడు మూడో విడత శిక్షణ

ఐసిఎఫ్, ఏప్రిల్ 17: నగరంలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల పోలింగ్ బూత్ ఉద్యోగులకు గురువారం మూడో విడత శిక్షణా తరగతులు జరుగనున్నాయి. శుక్రవారం జరుగనున్న లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని చెన్నై జిల్లా పరిధిలోని 16 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 3,726 పోలింగ్ బూత్‌ల్లో విధులు నిర్వహించనున్న ఉద్యోగులకు తొలివిడత శిక్షణ మార్చి 24న నిర్వహించగా, ఈ శిక్షణలో పాల్గొనని వారికి 30వ తేది శిక్షణ ఇచ్చారు. రెండో విడత శిక్షణ ఈ నెల 7వ తేది జరుగ్గా, ఆ రోజు హాజరుకాని వారికి 13వ తేది శిక్షణ ఇచ్చారు. మూడో విడత శిక్షణా తరగతులు గురువారం ఉదయం 9 గంటలకు 16 పోలింగ్ బూత్‌ల్లో జరుగనున్నాయి.

చెరువులో మునిగి విద్యార్థి మృతి

● నేత్రాలు దానం చేసిన తల్లిదండ్రులు

ప్యారీస్, ఏప్రిల్ 17: కాంచీపురం జిల్లా శ్రీ పెరుంబుదూర్ చెరువులో ఈత కెళ్లి నీటమునిగి మృతిచెందిన ప్లస్ టూ విద్యార్థి నేత్రాలను తల్లిదండ్రులు దానం చేశారు. శ్రీ పెరుంబుదూర్‌కు చెందిన పద్మనాభన్ కుమారుడు శిబు (16) ప్లస్ టూ చదువుతున్నాడు. వేసవి సెలవులు ప్రారంభం కావడంతో శిబు తన సోదరుడు, ఐదుగురు మిత్రులతో కలసి ఇంటికి సమీపంలో ఉన్న చెరువులో సోమవారం స్నానానికి వెళ్లారు. శిబు హఠాత్తుగా నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో, మృతుడి నేత్రాలను ఆయన తల్లిదండ్రులు ఐ బ్యాంక్‌కు దానంచేశారు. ఈ ఘటనపై శ్రీ పెరుంబుదూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తిరుచ్చి జిల్లాలో నీడ లేని రోజు



గుండ్రంగా నిలబడిన విద్యార్థులు

పెరంబూర్, ఏప్రిల్ 17: సూర్యుడు ప్రతిరోజు మనకు నేరుగా పైన ఉన్నట్లు అనిపించినప్పటికీ, సంవత్సరంలో కేవలం రెండు రోజులు మాత్రమే అది పైకి చేరుకుంటుంది. అప్పుడు, ఒక వస్తువుపై సూర్యరశ్మి పడిన ఫలితంగా, నీడ వస్తువు యొక్క ఉపరితలం లోపల వస్తుంది, దాని నీడ కనిపించదు. ఈ దృశ్యం రెండు నిమిషాలు మాత్రమే ఉంటుంది. ఈ రోజులను షాడో లెస్ డే, జీరో షాడో డే అంటారు. ఆ ప్రకారం, బుధవారం తిరుచ్చి జిల్లాలోని తిరుచ్చి, మనప్పారై, వైయంబట్టి, మరుంగాపురి, మణికండం, తిరువెరుంబూర్ ప్రాంతాల్లో బుధవారం జీరో షాడో డే కనిపించింది. గురువారం పుల్లాంపట్టి, లాల్‌గుడి, మనచ్చనల్లూర్, శ్రీరంగం, ముసిరి ప్రాంతాల్లోను, శుక్రవారం దురైయూర్ ఉప్పిలాపురం ప్రాంతంలో కనిపిస్తుందని, మీ ఊర్లో ఇలాంటి దృశ్యం ఎప్పుడు కనిపిస్తుంది అనే వివరాల కోసం https://alokm.com/zsd.html అనే వెబ్‌సైట్ సంప్రదించి, మీ ప్రాంతం పేరు నమోదుచేసి తెలుసుకోవచ్చని తమిళనాడు సైన్స్ సంస్థ తిరుచ్చి జిల్లా కార్యదర్శి మణికంఠన్ తెలిపారు.

పరిశీలనకు ఇన్ని రోజులా...?

● రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

పెరంబూర్, ఏప్రిల్ 17: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం చేసే వ్యవహారంపై, ఎంత కాలం పరిశీలిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని మద్రాసు హైకోర్టు ప్రశ్నించింది. శాసనసభ సమావేశాలు ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ దివంగత డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్ సహా పలువురు మద్రాసు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్ల విచారణ మంగళవారం జరిగిన సమయంలో ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది... శాసనసభ సమావేశాల ప్రత్యక్ష ప్రసారం చేసే అంశంపై పలు రాష్ట్రాల వివరాలు అడిగామని, కొన్ని రాష్ట్రాలు తెలియజేసినా, మరికొన్ని రాష్ట్రాలు ఇంకా బదులివ్వలేదని తెలిపారు. అలాగే, ప్రత్యక్ష ప్రసారం వ్యవహారం స్పీకర్ పరిశీలిస్తున్నట్లు, పూర్తి సమాచారం అందిన వెంటనే తగిన నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వం తెలిపింది. అందుకు ఎన్ని రోజులు పరిశీలిస్తారంటూ ప్రశ్నించిన న్యాయస్థానం, ఈ వ్యవహారంపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని కోరుతూ తదుపరి విచారణ జూన్ 25వ తేదీకి వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

భారత్‌లో విస్తరణపై దృష్టిసారించిన ఫన్‌స్కూల్



ప్లాంట్ ప్రారంభిస్తున్న అరుణ్ మమ్మెన్

అడయార్, ఏప్రిల్ 17: దేశంలో ప్రముఖ బొమ్మల తయారీ కంపెనీ ఫన్‌స్కూల్ ఇండియా తన ఫ్యాక్టరీ విస్తరణపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని రాణిపేటలో విలాసవంతమైన సౌకర్యాలతో ఒక ప్లాంట్ నెలకొల్పింది. ఈ విషయాన్ని ఆ సంస్థ ఛైర్మన్ అరుణ్ మమ్మెన్ నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. అంతర్జాతీయ స్థాయిలో గణనీయమైన వృద్ధి సాధించేందుకు వీలుగా తమ ఫ్యాక్టరీ కార్యకలాపాలను తమిళనాడు రాష్ట్రంలో విస్తరించడం గర్వంగా ఉందన్నారు. యూనిట్ 1, 2లలో అత్యాధునిక సౌకర్యాలతో ఫన్‌స్కూల్ ఉత్పత్తి సామర్థ్యాలలో గణనీయమైన పెట్టుబడిని సాధిస్తామని ఆయన పేర్కొన్నారు. రాణిపేట రెండు యూనిట్లతో పాటు గోవాలోని మొదటి యూనిట్‌లో ఫన్‌స్కూల్ 1,62,664 చదరపుటడుగుల విస్తీర్ణాన్ని కలిగివుందని పేర్కొంది.

వైద్యుడు గొంతు కోసిన ఆటో డ్రైవర్

పుదుచ్చేరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వాస్పత్రిలో కత్తితో వైద్యుడి గొంతు నరికిన ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 12వ తేది పుదుచ్చేరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముగ్గురు యువకులను పుదుచ్చేరి ఇందిరా గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి (జిప్మర్)కి తరలించారు. వీరిలో చికిత్స ఫలించక ఓ యువకుడు మృతిచెందగా, మిగతా ఇద్దరికి చికిత్స జరుగుతోంది. వీరిలో ఓ యువకుడు మహేష్ (16) తండ్రి వినోద్ (39) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మద్యం మత్తులో కుమారుడిని పరామర్శించేందుకు ఆస్పత్రికి వెళ్లిన అతడిని డ్యూటీ డాక్టర్ నవీన్‌కుమార్ మద్యం సేవించి ఆస్పత్రికి రావడంపై మందలించినట్లు తెలిసింది. దీంతో ఆగ్రహం చెందిన ఆటో డ్రైవర్ కత్తితో వైద్యుడిని గాయపరిచాడు. తప్పించుకొనేందుకు యత్నించిన వినోద్‌ను రోగుల బంధువులు బంధించి పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా, గాయపడిన వైద్యుడికి ఆసుపత్రిలో చికిత్స కొనసాగిస్తున్నట్లు విచారణ చేపట్టిన పోలీసులు తెలిపారు.

డీఎంకే మాజీ మంత్రి గదిలో రూ.11 లక్షలు స్వాధీనం

పెరంబూర్, ఏప్రిల్ 17: డీఎంకేకు చెందిన మాజీ మంత్రి సురేష్‌రాజన్ తిరునల్వేలి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఆలంగుళం శాసనసభ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆయన పాత కుట్రాలం ప్రాంతంలో ఉన్న ఓ లాడ్జీలో బసచేస్తూ ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆయన ఎన్నికల ప్రచారంలో ఉన్న సమయంలో లాడ్జీ వద్దకు చేరుకున్న ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఆయనను సెల్‌ఫోన్‌లో సంప్రదించి, మీ గదిలో తనిఖీలు చేపట్టాలని కోరారు. ఆయన అక్కడకు చేరుకొని గది తెరువగా, తనిఖీ చేసిన అధికారులు, అక్కడ రూ.11 లక్షలు స్వాధీనం చేసుకొని ఆయనను విచారిస్తున్నారు.

బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో కచ్చాదీవి అంశం ఏదీ...?

● మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం

పెరంబూర్, ఏప్రిల్ 17: కచ్చాదీవి వ్యవహారంపై ప్రధాని నుంచి కేంద్ర మంత్రులు అందరూ మాట్లాడారని, కానీ బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో కచ్చాదీవి విషయం ఎందుకు ప్రస్తావించలేదని మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం ప్రశ్నించారు. శివగంగలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... పదేళ్ల క్రితం బీజేపీ మేనిఫెస్టోలో ఉన్న హామీలే ప్రస్తుత మేనిఫెస్టోలో కూడా ఉన్నాయన్నారు. సాధ్యం కాని హామీలు గుప్పించి ప్రజలను మభ్యపెట్టేలా బీజేపీ మేనిఫెస్టో ఉందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోకు ప్రజాదరణ పెరిగిందన్నారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలుచేస్తామని బీజేపీ చెబుతోందని, ఈ ప్రక్రియ దేశ ప్రజలను విడదీసి విబేధాలు సృష్టించి, ఘర్షణ వాతావరణం నెలకొల్పేలా ఉందన్నారు. దేశాన్ని విభజించేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని బీజేపీ ఆరోపిస్తోందని, జమ్ము కశ్మీర్‌ను మూడుగా విభజించింది ఎవరని ప్రశ్నించారు. దేశాన్ని సర్వాధికారి మార్గంలో పయనింపజేసేలా బీజేపీ చర్యలున్నాయని, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు మరింత హెచ్చరికతో ఓటు వేయాలని చిదంబరం విజ్ఞప్తి చేశారు.

ఓటరు జాబితాలో పేరు చేర్చాలనే పిటిషన్ తోసిపుచ్చిన హైకోర్టు

పెరంబూర్, ఏప్రిల్ 17: తపాలా ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో, ఓటరు జాబితాలో పేరు చేర్చాలనే పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాలకు ఈ నెల 19వ తేది ఒకే విడత పోలింగ్ జరుగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే తపాలా ఓటు హక్కు వినియోగించుకొనేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఆ ప్రకారం తపాలా ఓటుకు నమోదుచేసుకున్న వారి ఇళ్ల వద్దకే వెళ్లి తపాలా ఓట్లు నమోదుచేసే చర్యలను అధికారులు చేపట్టారు. ఈ నేపథ్యంలో, కేథ్రీన్ మార్టిన్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో...తనకు తెలియకుండానే ఓటరు జాబితా నుంచి తన పేరు తొలగించారని, మళ్లీ తన పేరు ఓటరు జాబితాలో చేర్చేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రాగా, లోక్‌సభ పోలింగ్‌కు సంబంధించి తపాలా ఓటు నమోదు ప్రారంభమైన నేపథ్యంలో, ఓటరు జాబితా పేరు చేర్చలేమని ఎన్నికల సంఘం వివరణ ఆమోదిస్తూ పిటిషన్ తోసిపుచ్చుతున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు.

అన్నాడీఎంకే వాహన ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న అన్నాడీఎంకే నేత అప్పు

వేలూరు, ఏప్రిల్ 17: వేలూరు లోక్‌సభ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థి డా.పసుపతికి మద్దతుగా బుధవారం వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారానికి బుధవారం చివరి రోజు కావడంతో వేలూరు కార్పొరేషన్ జిల్లా సెక్రటరీ ఎస్ఆర్కే అప్పు నేతృత్వంలో జరిగిన ర్యాలీలో వేలూరు తూర్పు సెక్రటరీ కుప్పుస్వామి, జిల్లా వర్తక విభాగం సెక్రటరీ చూలై కేఎం ఆనందన్, పార్టీ అనుబంధాల సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరువొద్దు...2వ గుర్తు... 'కమలం'



ప్రచారంలో బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగం

వేలూరు, ఏప్రిల్ 17: వేలూరు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగం పట్టణంలో పలు ప్రాంతాల్లో బుధవారం ప్రచారం చేపట్టారు. ఈవీఎంలో రెండవ నెంబరులో ఉన్న 'కమలం' గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఏఎంఎంకే జిల్లా సెక్రటరీ వాసు, బలరామన్ సహా పలువురు కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడు రోజులు డిజిటల్ పేమెంట్స్‌పై ప్రత్యేక నిఘా

పెరంబూర్, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బుధవారం నుంచి మూడు రోజులు గూగుల్ పే, ఫోన్ పే తదతర ఆన్‌లైన్ పేమెంట్స్‌పై ప్రత్యేక నిఘా వేయాలని ఎన్నికల అధికారులను రాష్ట్ర ఎన్నికల వ్యయ ప్రత్యేక పరిశీలకులు పీఆర్ బాలకృష్ణన్ ఆదేశించారు. మదురై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారం బుధవారంతో ముగిసిన నేపథ్యంలో, వాహన తనిఖీలను ఫ్లయింగ్ బృందాలు ముమ్మరం చేయాలన్నారు. కార్లు, సరుకు వాహనాలు, బ్యాంక్ ఏటీఎంలలో నగదు నింపే వాహనాలు సహా అన్నీ తనిఖీ చేయాలని, తగిన ఆధారాలు లేకుండా నగదు, బహుమతులు తరలిస్తే వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. అలాగే, ఓటర్లకు మభ్యపెట్టేలా అభ్యర్థులు నగదు పంపిణీలో డిజిటల్ విధానాన్ని ఎంచుకుంటున్నారని, అందువల్ల జీపే, ఫోన్‌పేలపై నిఘా పెట్టాలని సూచించారు. ఒకే నెంబరు నుంచి అధికంగా జీ పే, ఫోన్ పే వెళ్లినట్లయితే వాటిని గుర్తించి సత్వరం విచారణ చేపట్టాలని బాలకృష్ణన్ ఆదేశించారు.

సీటీఏ ఆధ్వర్యంలో సీతారామకల్యాణం



కళ్యాణోత్సవంలో పాల్గొన్న చెన్నై తెలుగు అసోసియేషన్ నిర్వాహకులు, సభ్యులు

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మధురవాయల్ సీతాలక్ష్మి కల్యాణమండపంలో చెన్నై తెలుగు అసోసియేషన్ (సీటీఏ) ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా బుధవారం ఉదయం సీతారామకల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు వలసరవాక్కంలోని సంస్థ కార్యాలయం నుంచి కల్యాణ మండపం వరకు ఉత్సవమూర్తులను ఊరేగించారు. కల్యాణమండపంలోని వేదికపై ఉత్సవమూర్తులను వేంచేపుచేసి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెంగల్పట్టు సమీపం ఆత్తూరు వేద పాఠశాల నిర్వాహకులు కామకోటి, కుమారగురు పర్యవేక్షణలో వేదపాఠశాల విద్యార్థులు వేదపారాయణం చేశారు. అనంతరం భద్రాచలం తరహాలో స్వామివారి కల్యాణోత్సవం ప్రారంభమైంది. వరుడు శ్రీరామచంద్రమూర్తి తరపు బంధువులా నలుగురు దంపతులు, వధువు సీతాదేవి తరఫున నలుగురు దంపతులు పాల్గొన్ని కల్యాణ నిశితార్థం, కన్యాదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆ సంస్థ అధ్యక్షుడు కేఆర్కే బాలాజీరావు, ఉపాధ్యక్షుడు అశోక్ కిషన్, సంస్థ కార్యదర్శి వైఎస్వీ సుబ్బారావు, సంయుక్త కార్యదర్శులు టీవీఎల్ నరసింహారావు, వెంకటేశ్వర్లు, నాగరాజ్ కమిటీ సభ్యులు ప్రసాద్, మధుకర్, శ్రీహరిరావు, శ్రీనివాస్, నాగేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. చివరగా శ్రీరామ కళ్యాణోత్సవ లడ్డూకు నిర్వహించిన వేలంపాటలో నిర్మలాదేవి అనే భక్తురాలు రూ.12 వేలకు పాటపాడి దక్కించుకున్నారు. ఈ కళ్యాణోత్సవానికి హాజరైన భక్తులందరికీ ఆంధ్రావంటకాలతో భోజన సదుపాయం కూడా కల్పించారు.

ఒక్కసారి ఆలోచించండి ప్లీజ్!

... వినోజ్ పి.సెల్వం విజ్ఞప్తి

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధితో ఎవరు స్పందిస్తారో గ్రహించి, ప్రజలు ఓటేయాలని సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం విజ్ఞప్తి చేశారు. బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టిన వినోజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... సిట్టింగ్ ఎంపీగా వున్న దయానిధి మారన్.. ఇన్నాళ్లలో ఈ ప్రాంతానికి ఏం చేశారో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలన్నారు. అలాంటి వ్యక్తికి ఓటేస్తే మళ్లీ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోవడం ఖాయమన్నారు. అందుకే ఒక్కసారి తనకు అవకాశం ఇస్తే ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తును ఖరారు చేసేవన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో గత పదేళ్లలో దేశం ఎంతో ముందంజలో వుందని, మూడో సారి కూడా మోదీ ప్రధాని అయితే మరింత అభివృద్ధి పథంలోకి దూసుకెళ్తుందన్నారు. మోదీ ప్రభుత్వ ఏర్పాటులో తమిళనాడు కూడా భాగస్వామి కావాల్సివుందని, అందుకే ప్రజలు తనకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ఎన్నికలు తమ తల రాతతో పాటు దేశ ముఖచిత్రాన్ని కూడా మార్చివేస్తాయన్న విషాన్ని ప్రజలు గ్రహించాలని వినోజ్ విజ్ఞప్తి చేశారు.


ప్రచారంలో వినోజ్ పి.సెల్వం





నిన్నటిదాకా పిలవని పేరంటం...

● నేడు పిలిచినా పలికేవారు లేక తంటా ● పాపం ఓటరు!

సార్వత్రిక సమరం

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఒక్క ఓటు తేడాతో గెలిచినవారున్నారు, ఓడిపోయినవారున్నారు. మన ఓటు విలువ అంత గొప్పది. ఇక ఓటేసే ఓటరు విలువ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ప్రచార పర్వం ముగిసేదాకా హిమాలయాల కంటే ఎత్తయినదని చెప్పొచ్చు. అన్ని పార్టీల నాయకులకు, ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రధానికి, అభ్యర్థులకు ఓటర్లే దేవుళ్లు. ఎంతటి ఘనాపాటీ నేతలైనా ఎన్నికల సమయంలో ఓటరు దేవుడికి వంగి వంగి నమస్కరించాల్సిందే! గత మూడు దశాబ్దాలుగా ఓటర్లను ఆకట్టుకునేందుకు పార్టీల నేతలు, అభ్యర్థులు వింత పద్ధతులను ఎంచుకున్నారు. మొదటిది మహిళలతో హారతులు, తిలకాలు దిద్దుకోవడం. హారతిపట్టిన మహిళకు తెలియకుండా నోటివ్వడం. ఇక రోడ్‌సైడ్ బడ్డీ కొట్ల వద్దకు వెళ్ళి జంతికలు కాల్చడం, దోసెలు పోయడం. టీషాపులకు వెళ్ళి అప్పటిదాకా టీ ఎలా వేయాలో కూడా తెలియని నాయకులు, అభ్యర్థులు ఓపిగ్గా టీ తయారు చేసి తాము తాగి కార్యకర్తలకు అందించారు. వేసిన టీకి, తాగిన టీకి తప్పకుండా డబ్బులు చెల్లిస్తారు. రోడ్‌సైడ్ తోపుడ బండ్ల ఇస్త్రీ దుకాణాలు కనిపిస్తే చాలు వెంటనే ఇస్త్రీపెట్టె తీసుకుని చొక్కా మడచి ఇస్త్రీ వేస్తారు. నీటి కొళాయిల వద్దకు వెళ్ళి నీటిని తోడేశారు. ఎక్కడైనా ఉత్సవాలు జరిగితే అక్కడికి వెళ్ళి డప్పులు, డోలు వాయించారు. వ్యాన్‌లో ప్రచారం చేస్తూ వెళ్తూ పొలాలు కనిపిస్తే చాలు, వెంటనే పార్టీ నేతలు, అభ్యర్థులు దిగి వ్యవసాయకూలీలతో కలిసి పంట కోత కోశారు. అవసరమయితే పలుగు పట్టుకుని కలుపు కూడా తీశారు. ఆహా మన పార్టీ నాయకులు ఎంత నిరాడంబరంగా నడచుకుంటున్నారో కదా అని అందరూ ఆశ్చర్యపోయారు. ఇక ఏదైనా ప్లే గ్రౌండ్ కనిపిస్తే చాలు అక్కడికి కూడా వెళ్లారు. టెన్నిస్, ఫుట్‌బాల్, క్రికెట్.. ఇలా ఒకటేమిటి.. కనిపించిన ఆటల్లా ఆడేశారు. రోడ్లపై రిక్షాలు కనిపిస్తే వాటిని కూడా తొక్కేశారు. సైకిల్ సవారీ సరేసరే. ఇక ఆధ్యాత్మిక పరంగాను ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు ప్రచారానికి వెళ్లే ప్రాంతాల్లో ఉన్న ప్రముఖ దేవాలయాలను తప్పకుండా దర్శించుకున్నారు. మసీదు, దర్గాలకు కూడా వెళ్ళి అన్ని మతాలు మాకు సమానమేనంటూ ఎలుగెత్తి చాటారు. ఇలా ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుండి ప్రచార ఘట్టం ముగిసేంతవరకూ ఓటర్లే దేవుళ్లంటూ వారిని ఆకట్టుకునేందుకు పార్టీ నేతలు, అభ్యర్థులు మూడు వారాలకు పైగా చేసిన ఈ వింత విన్యాసాలన్నీ బుధవారం సాయంత్రంతో నిలిచిపోయాయి. మూడువారాలపాటు పిలవని పేరంటంగా పనిగట్టుకుని వరుసగా వచ్చిన వారంతా ఒక్కసారిగా అదృశ్యమైపోయారు. పాపం ఓటరు మహాశయుడు రాష్ట్రంలో మళ్లీ తనను బ్రతిమలాడుకునే వారి కోసం మరో రెండేళ్ల వేచి వుండాలేమో!?

● ప్రచార పాట్లు




తూత్తుకుడి నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి కనిమొళికి ఖడ్గాన్ని బహూకరిస్తున్న ఓ కార్యకర్త - తిరుచ్చి నియోజకవర్గ ఎండీఎంకే అభ్యర్థి దురై వైగోకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో



● అంతేగా! అంతేగా!

ఓటేస్తే 'కుక్కర్' గుర్తు బటన్ అదిరిపోవాలి

● దినకరన్ భార్య అనూరాధ

పెరంబూర్, ఏప్రిల్ 17: తన భర్త దినకరన్‌పై నియోజకవర్గ ప్రజలు చూపిస్తున్న ఆదరణ తలుచుకుంటే ఆశ్చర్యంగా ఉందని, ఆర్కే నగర్‌లో పెద్ద పార్టీల అభ్యర్థులతో ఢీకొని ఆయన విజయం సాధించారని దినకరన్ సతీమణి అనూరాధ పేర్కొన్నారు. తేని నియోకవర్గంలో ఏఎంఎంకే అభ్యర్థి టీటీవీ దినకరన్‌కు మద్దతుగా ఆయన సతీమణి అనూరాధ బుధవారం ప్రచారం చేపట్టారు. మేల్‌మనలూరు, మేఘమలై, హైవేవిస్ తదితర ప్రాంతాల్లో ఆమె ప్రచారంలో మాట్లాడుతూ... 14 ఏళ్ల తర్వాత వచ్చినా ప్రజలు అభిమానం తగ్గలేదన్నారు. ఆ ఎన్నికల్లో ప్రజలు 'కుక్కర్' గుర్తుకు ఓటేసే సమయంలో ఈవీఎంల్లోని 'కుక్కర్' గుర్తు బటన్లు మరమ్మతులకు గురవుతున్నారని అధికారులు వాపోయారని, వచ్చే శుక్రవారం జరుగనున్న ఎన్నికల్లోనూ ఈవీఎంలలో కుక్కర్ గుర్తు బటన్‌కు అదే పరిస్థితి నెలకొంటుందా అనే అనుమానం వస్తోందని అనూరాధ అన్నారు.



● అవునా?

మండు టెండలో చెమట తుడుచుకుంటున్న సెల్లూర్ రాజు

ఎండల వల్ల విటమిన్-డి లభిస్తుంది...!

● మాజీ మంత్రి సెల్లూరు రాజు

పెరంబూర్, ఏప్రిల్ 17: మదురై నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థి శరవణన్‌కు మద్దతుగా ఆ పార్టీ మాజీ మంత్రి సెల్లూరు రాజు ప్రచారం చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు టాపు లేని జీపులో నియోజకవర్గం మొత్తం తిరుగుతున్నారు. బుధవారం ప్రచారం చివరి రోజు కావడంతో ఆయన మళ్లీ నియోజకవర్గంలో ప్రచారం చేపట్టారు. మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, ఓ సెంటర్‌లో సెల్లూరు రాజు మాట్లాడుతుండగా, కార్యకర్తలు దూరంగా ఉన్న దుకాణాల వద్ద నీడలోకి వెళ్లారు. వారిని గమనించిన సెల్లూర్ రాజు 'ఎండలు మంచివని వైద్యులు తెలిపారని, ఎండల్లో తిరగడం వల్ల విటమిన్-డి లభిస్తుందని, అందువల్ల అందరూ వాహనం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఎండలో ఉంటే విటమిన్-డి పక్కనబెడితే వడదెబ్బ తగులుతుందని పలువురు కార్యకర్తలు వ్యాఖ్యానించారు.

● తెలుసుకోండి ప్లీజ్

ఓటరు స్లిప్పు లేదా...?

అయితే ఈ ఆధారాలు తీసుకెళ్లండి

పెరంబూర్, ఏప్రిల్ 17: రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాలకు ఈ నెల 19వ తేది పోలింగ్ జరుగనుంది. ఓటరు జాబితాలో పేరున్న వారి ఇంటింటికీ వెళ్లి బూత్ స్లిప్పులను ఎన్నికల సంఘం అందజేసింది. ఈ బూత్ స్లిప్పులు పొందిన వారు తమ ఓటరు గుర్తింపు కార్డుతో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఒకవేళ బూత్ స్లిప్పు అందకపోతే 12 రకాలు గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక దానిని తీసుకెళ్లి ఓటు వేయవచ్చు. ఆ 12 రకాల గుర్తింపు కార్డులను ఎన్నికల సంఘం సూచించింది. అవేమంటే..?!

1. ఆధార్ కార్డు 2. డ్రైవింగ్ లైసెన్స్ 3. పాన్ కార్డు 4. పాస్ పోర్టు 5. ఫోటోతో కూడిన బ్యాంక్, పోస్టాఫీస్ పాస్ బుక్ 6. ఫోటోతో కూడిన పింఛన్ గుర్తింపు కార్డు 7. ఆర్బీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు 8. కార్మిక మంత్రిత్వ జారీచేసిన వైద్య బీమా స్మార్ట్ కార్డు 9. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల గుర్తింపు కార్డు 10. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామి గుర్తింపు కార్డు 11. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీచేసి అధిక గుర్తింపు పత్రం 12. దివ్యాంగుల గుర్తింపు కార్డు.



● నిజమే!?

వృద్ధుల ఆశీర్వాదం తీసుకుంటున్న అన్నామలై

వృద్ధాశ్రమంలో కన్నీరు పెట్టిన అన్నామలై

పెరంబూర్, ఏప్రిల్ 17: కోయంబత్తూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అన్నామలై ప్రచారంలో చివరి రోజైన బుధవారం కస్తూరి నాయక్కన్‌పాళయంలోని వృద్ధాశ్రమానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏడాది కాలంగా ఈ ప్రాంతానికి వచ్చి వృద్ధులతో కలసి ఆనందంగా గడపాలని ఉన్నా సమయం లభించలేదన్నారు. ఈసారి ఎలాగైనా కలుసుకోవాలనే లక్ష్యంతో ఎన్నికల ప్రచారంలో చివరి రోజున రావడం జరిగిందని అన్నామలై అన్నారు. ఈ శరణాలయంలో తల్లిదండ్రులు పిల్లలను పెంచే విధానంపై మాట్లాడుతున్న అన్నామలై ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు. దీనిని గమనించిన నిర్వాహకులు ఆయన్ని సముదాయించారు. తొలుత ఆశ్రమానికి వస్తున్న అన్నామలైను 'జై శ్రీరామ్' అంటూ వృద్ధులు నినాదాలు చేస్తూ ఆశీర్వదించారు.

2019 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీల వారీగా పోలైన ఓట్ల శాతం

● సమాచారం

పెరంబూర్, ఏప్రిల్ 17: 2019లో జరిగిన 17వ లోక్‌సభ ఎన్నికల్లో రెండవ విడతలో ఏప్రిల్ 18వ తేది ఒకే విడతలో ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో కాంగ్రెస్ 9 స్థానాలు, సీపీఎం, సీపీఐ, డీపీఐలు తలా రెండు స్థానాలు, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, ఎండీఎంకే, కేఎండీకే, ఇండియా జననాయగ పార్టీ (ఐజేకే) తలా ఒక స్థానంలో పోటీచేయగా, కూటమికి నేతృత్వం వహించిన డీఎంకే 20 స్థానాల్లో పోటీచేసింది. ఇక, అన్నాడీఎంకే కూటమిలో పీఎంకే ఏడు స్థానాలు, బీజేపీ 5 స్థానాలు, డీఎండీకే 4 స్థానాలు, పుదియ నీతి పార్టీ, పుదియ తమిళగం, టీఎంసీలు తలా ఒక స్థానంలో పోటీచేశాయి. అలాగే, తృతీయ కూటమిగా అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) 38 స్థానాలు, సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్డీపీఐ) ఒక స్థానంలో పోటీచేశాయి. ఆ ఎన్నికల్లో ఒంటరిగా నామ్ తమిళర్ పార్టీ 39 స్థానాలు, మక్కల్ నీది మయ్యం 36 (ఎంఎన్‌ఎం) స్థానాల్లో పోటీచేశాయి. ఈ ఎన్నికల్లో కూటమి పార్టీలు పొందిన ఓట్లు, సీట్ల వివరాలు....

కూటమి పార్టీలు	గెలిచిన స్థానాలు	మార్పు	పొందిన ఓట్లు	శాతం
యూపీఏ	38	+38	22,789,020	53.15%
డీఎంకే	24	+24	14,363,332	33.52%
కాంగ్రెస్	8	+8	5,405,674	12.61%
సీపీఎం	2	+2	1,018,225	2.37%
సీపీఐ	2	+2	1,031,617	2.4%
వీసీకే	1	+1	500,229	1.1%
ఐయూఎంఎల్	1	+1	469,943	1.09%

ఈ ఎన్నికల్లో కేఎండీకే, ఐజేకే, ఎండీఎంకేలు డీఎంకే గుర్తు 'ఉదయించే సూర్యుడు'పై పోటీచేశాయి.

ఎన్డీఏ	1	-38	13,307,139	30.57%
అన్నాడీఎంకే	1	-36	8,307,139	19.39%
పీఎంకే	0	-1	2,297,431	5.36%
బీజేపీ	0	-1	1,551,924	3.66%
డీఎండీకే	0	0	929,590	2.16%
పీటీ	0	0	355,389	0.82%
ఏఎంఎంకే, ఎస్డీపీఐ	0	0	23,741	0.05%
నామ్ తమిళర్ పార్టీ	0	0	1,672,217	3.90%
ఎంఎన్‌ఎం	0	0	1,575,640	3.67%


శ్రీపెరుంబుదూరు డీఎంకే అభ్యర్థి టీఆర్ బాలుకు మద్దతుగా చెన్నై సెయింట్ థామస్ మౌంట్‌లో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తున్న టామ్స్ నిర్వాహకులు గొల్లపల్లి ఇస్రాయేలు, నేలటూరి విజయకుమార్, ఎయిర్‌పోర్ట్ గోపి తదితరులు

తిరువళ్లూరు నియోజకవర్గంలో

మోటర్ సైకిల్ ర్యాలీ

● ప్రచారం కోసం..

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పొన్ బాలగణపతికి మద్దతుగా బుధవారం ఆవడి సమీపంలోని తిరువేర్కాడు నుంచి పచ్చయమ్మన్ ఆలయం వరకు మోటర్ సైకిల్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని బీజేపీ రాష్ట్ర కో-ఇన్‌చార్జ్ డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరువళ్లూరు పశ్చిమ జిల్లా విభాగ అధ్యక్షుడు అశ్విన్ రాజసింహ మహేంద్ర, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆనందప్రియ తదితరులు కూడా పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి



● మంత్రి గారి శపథం

మోదీని ఇంటికి పంపేదాకా నిద్రపోను!

చెన్నై, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీని ఇంటికి సాగనందపేదాకా నిద్రపోనని డీఎంకే యువజన విభాగం నాయకుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి అన్నారు. బుధవారం ఆయన కోయంబత్తూరులో డీఎంకే అభ్యర్థి గణపతి రాజ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. సింగనల్లూరు బస్‌స్టాండు కూడలి వద్ద రోడ్‌షోలో పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ ఈ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి ఇండియా కూటమి గెలిపించేందుకు ఓటర్లంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే గ్యాస్ ధరను రూ.500లకు తగ్గిస్తామని, లీటర్ పెట్రోలు ధర రూ.75లకు, డీజిల్ ధర రూ.65 తగ్గిస్తామని ఆయన ప్రకటించారు.


కోయంబత్తూరులో డీఎంకే అభ్యర్థి గణపతి రాజ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న మంత్రి ఉదయనిధి



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

● కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం


కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


స్వామివారి ఊరేగింపు


ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు


గౌతమీ నదిలో పుణ్య స్నానాలు







అట్టుంటనా!

అన్న 'ఫిగర్' చెప్పమన్నాడు



'అన్న పంపించాడు' అంటూ తమ దగ్గరకు వాళ్లు రాగానే తిరుపతి నగరంలోని వ్యాపారులు గడగడ వణికిపోతున్నారు. ఎన్నికల ఖర్చు భారీగా పెరిగిందంటూ వసూల్ రాజాలను తన తరపున రంగంలోకి దింపారని చెబుతున్నారు. నగరంలోని రియల్టర్లు, బిల్డర్లు, విద్యాసంస్థలు, ఆస్పత్రులను వసూల్ రాజాలు టార్గెట్‌గా చేసుకున్నారు. తిరుపతిలో పేరు మోసిన ఒక బిల్డర్‌కు కోటి రూపాయలు 'ఫిగర్' చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. హమ్మో.. కోటా? అని అతను ఆందోళన పడుతూ ఉంటే, మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో జరిగిన మేళ్లను వివరించి, భవిష్యత్తులో దున్నేసుకోవచ్చని భరోసా ఇచ్చారని తెలిసింది. ఆసుపత్రులకు అయితే, స్థాయిని బట్టి 'ఫిగర్' నిర్ణయించారు. హోటళ్లనూ ఊడ్చేస్తున్నారని అంటున్నారు. పార్టీ ఫండ్ పేరుతో కొనసాగుతున్న వసూళ్ల పర్వం ఇప్పుడు చర్చగా మారుతోంది. విశేషం ఏమిటంటే.. ఇలా వసూళ్లకు పంపే చోటా నేతలకు కమీషన్లు కూడా ఇస్తున్నారని చెప్పుకుంటున్నారు. దీంతో అన్న అనుచరగణం కొరడాలు బయటకు తీసి రంగంలోకి దిగుతున్నారని తెలిసి, కొందరు బిల్డర్లు సమ్మర్ ట్రిప్‌లకు చెక్కేస్తున్నట్టు తెలిసింది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

లీకులు...కాసులు



ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడబ్బా నాలుగు రాళ్లు ఎనకుసుకునేది.. అనుకుంటున్నారు వైసీపీ నాయకులు. నిజమే పాపం జగన్‌ను పీఠం ఎక్కించాక పథకాలకు తప్ప పనులకు పైసా ఇవ్వకపాయె. కాంట్రాక్టులు చేసుకుని నాలుగు కాసులు మిగుల్చుకునే అవకాశం రాకపాయె. అందుకే ఎన్నికల రోజుల్లో చిత్రమైన ఎత్తుగడ వేస్తున్నారు. ఇటీవల వడమాలపేటకు చెందిన ఇద్దరు వైసీపీ నాయకులు పార్టీ మారబోతున్నారనే ప్రచారం జరిగింది. దాంతో వైసీపీ పెద్దలు రంగంలోకి గబీమని దూకేశారు. ఇట్టాంటి వేళ ఇదేమి సామీ అని చెరో రెండు లక్షలు చేతల్లో పెట్టి సర్దేసినట్లు ప్రచారం జరుగుతోంది. నిజానికి వాళ్లకి పార్టీ మారే ఆలోచన లేదు. కావాలనే సోషల్ మీడియాకు టీడీపీలో చేరుతున్నట్టు లీకులు ఇచ్చారంట. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో కూడా ఇదే విధంగా కొందరు లీకులిచ్చి కాసులు రాబట్టుకున్నట్టు చెబుతున్నారు. ఇది చూసి పార్టీ మారబోతుండారంటూ లీకులు ప్రచారం చేసుకునే వాళ్ల సంఖ్య పెరిగింది. నిజమేదో, అబద్ధమేదో తెలీక పాపం నాయకులు జేబులు ఖాళీ చేసుకోక తప్పడం లేదు అని చెప్పుకుని జనం నవ్వుకుంటున్నారు.

- పుత్తూరు అర్బన్

పెద్ద నోటు... ఈసారి లోటు



ఎన్నికలొచ్చాయంటే నగదు, మద్యందే కీలక భూమిక. నోటిఫికేషన్ మొదలు ఓటరు పోలింగ్ కేంద్రానికి వెళ్లేవరకూ ఈ రెండే ప్రభావం చూపిస్తుంటాయి. ఓటర్లను దారిలోకి తెచ్చుకోవాలన్నా, ఫిరాయింపులు అడ్డుకోవాలన్నా వీటి అవసరం అంతాఇంతా కాదు. జేబులో చేయి పెట్టి నోటు తీస్తే కట్టంతా ఇవ్వాలని అడిగే రోజులివి. అభ్యర్థుల అదృష్టమో.. ఓటరు దురదృష్టమో తెలియదు గానీ గడచిన రెండు ఎన్నికల్లోనూ పెద్ద నోట్లు కనిపించకుండా పోయాయి. 2014 సాధారణ ఎన్నికల్లో పెద్ద నోటు అంటే 1000 ఒక్కటే. ఆ తర్వాత నోట్ల రద్దుతో వెయ్యి నోటు అడ్రస్ లేకుండా పోయింది. 2019 ఎన్నికల తర్వాత రూ. 2000 నోటు వచ్చింది. ఇప్పుడు ఆ నోటూ కనిపించడంలేదు. జేబులోకి చెయ్యిపోనిస్తే 500 నోటు లేదా 200 నోటు పెద్దవిగా కనిపిస్తున్నాయి. ఓటరుకైనా నాయకుడికైనా ఇచ్చే పెద్ద నోటు ప్రస్తుతానికి ఇదే.. అలాగని ఒకటో రెండో నోట్లిచ్చినా ఓటరు సంతృప్తి పడే రోజులు పోయాయని అభ్యర్థులు ఇప్పుడు పెద్ద నోట్ల వేటలో పడ్డారు.

- డక్కిలి

సత్యవేడులో గెలిచే పార్టీదే అధికారం

● సెంటిమెంట్


సత్యవేడులో గెలిచే పార్టీ రాష్ట్రంలో అధికారం చేపడుతుందని ఒక నమ్మకం. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ఆవిర్భావం తరువాత 2009 ఎన్నికలు మినహా మిగతా అన్ని ఎన్నికల్లోను ఇదే జరిగింది. 1983లో టీడీపీ అభ్యర్థి తలారి మనోహర్ గెలుపొందగా రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టింది. 1985లో మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎం.స్వరాజన్ గెలుపొందగా టీడీపీదే అధికారం. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సి.దాసు గెలుపొందగా కాంగ్రెస్ అధికారం చేపట్టింది. 1994లో టీడీపీ అభ్యర్థి ఎం.స్వరాజన్ గెలుపొందగా టీడీపీ అధికారంలోకి వచ్చింది. 1999లో టీడీపీ అభ్యర్థి శివప్రసాద్ గెలుపొందగా టీడీపీ అధికారంలో ఉంది. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి నారాయణస్వామి గెలుపొందగా అప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది. 2009లో మాత్రం టీడీపీ అభ్యర్థి హేమలత గెలుపొందిని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టింది. 2014లో టీడీపీ అభ్యర్థి తలారి ఆదిత్య గెలుపొందగా టీడీపీ అధికారంలో ఉంది. 2019లో వైసీపీ అభ్యర్థి ఆదిమూలం గెలుపొందగా వైసీపీ అధికారం చేపట్టింది.

- సత్యవేడు

మాట తప్పడు, మడమ తిప్పడు
నేను వున్నాను, నేను విన్నాను
విలువలు, విశ్వసనీయత
చెప్పాడంటే.. చేస్తాడంతే

.. 'ఒక్క ఛాన్సు' అంటూ 2018 పాదయాత్ర.. 2019 ఎన్నికల ప్రచారాల్లో విపక్ష నేతగా జగన్ హామీలిస్తూ చెప్పిన మాటలివి. వీటిని నమ్మి ప్రజలు ఒక్క అవకాశం ఇచ్చారు. మరి.. ముఖ్యమంత్రిగా ఆయన ఐదేళ్లలో తిరుపతి జిల్లాకు సంబంధించి నాటి హామీలేవీ నెరవేర్చలేదు. 'చెప్పాడంటే చేయడంతే' అన్నట్లుగా వ్యవహరించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



బాలాజీ రిజర్వాయరు నిర్మాణంలో భాగంగా చంద్రబాబు హయాంలో నిర్మించిన రాతి కట్ట

ఇంకా ఆరు నెలలు కాలేదా?

● గాలేరు- నగరి ప్రాజెక్టుకు నీళ్లొదిలేసిన జగన్ ● టెండర్లు రద్దు.. ప్రత్యామ్నాయ ప్రతిపాదనలతో సరి

అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో గాలేరు-నగరి ప్రాజెక్టును పూర్తి చేస్తా.
- 2018 జనవరి 6న సదుంలో, 16వ తేదీన వడమాలపేటలో పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీ.



ప్రాజెక్టు నేపథ్యం

రాయలసీమ కరువు నివారణకు దివంగత ఎన్టీ రామారావు సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపాదించిన ప్రాజెక్టుల్లో గాలేరు-నగరి ఒకటి. ఈ ప్రాజెక్టు రెండో దశలో 8 నుంచి 14 వరకు.. ఏడు ప్యాకేజీలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించినవి.

ప్రయోజనం కలిగే ప్రాంతాలు

తిరుపతి రూరల్, రామచంద్రాపురం, వడమాలపేట, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, కేవీబీపురం, పిచ్చాటూరు, నాగలాపురం, నిండ్ర, విజయపురం, పుత్తూరు, నగరి, నారాయణవనం తదితర 14 మండలాలు. ఈ ప్రాంతంలోని 1.035 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి.

'కాంగ్రెస్' హయాంలో అనుమతులతో సరి

ఉమ్మడి కడప జిల్లా నుంచి శేషాచల పర్వతాలలో రెండు చోట్ల టన్నెళ్లు తవ్వాలి. మొదటి టన్నెల్ ద్వారా రేణిగుంట మండలం బాలాజీ రిజర్వాయర్‌కు నీటిని చేర్చాలి. అక్కడ్నుంచి మల్లిమడుగు.. ఆపై పద్మసాగర్, శ్రీనివాస సాగర్, వేణుగోపాల సాగర్, వేపగుంట, అడవి కొత్తూరు రిజర్వాయర్లను నింపాలి.దీనికోసం మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం పెంచాలి. మిగిలినవి కొత్తగా నిర్మించాలి. రెండు టన్నెళ్లతో కూడిన 94 కిలోమీటర్ల ప్రధాన కాలువ, ఏడు రిజర్వాయర్ల నిర్మాణానికి 2005లో రూ.2189 కోట్ల అంచనాతో అప్పటి ప్రభుత్వం పనులు మంజూరు చేసింది. ఆ అంచనాలను 2008లో రూ.2526 కోట్లకు సవరించింది. వీటికి అనుమతి వచ్చిందే గానీ.. ఆరేళ్ల పాటు పనులు మొదలు కాలేదు.



టీడీపీ హయాంలోనే బాలాజీ రిజర్వాయర్ వద్ద కాలువ తవ్వకం

చంద్రబాబు వచ్చాక పరుగులు

2014లో చంద్రబాబు సీఎం కాగానే రూ.2526 కోట్లతో ఈ ప్రాజెక్టుకు టెండర్లు పిలిచారు. పద్మసాగర్, శ్రీనివాస సాగర్ రిజర్వాయర్లకు ప్రైవేటు భూముల సేకరణ ముగిసింది. బాలాజీ రిజర్వాయర్ కట్ట.. అక్కడ్నుంచి మల్లిమడుగు రిజర్వాయరు వరకు కాలువ తవ్వకం పనులు మొదలయ్యాయి. మల్లిమడుగు సామర్థ్యాన్ని 0.18 టీఎంసీల నుంచి 2.65 టీఎంసీలకు పెంచేందుకు రూ.56.08 కోట్లతో పనులు మొదలు పెట్టి.. రూ.25 కోట్లు ఖర్చుపెట్టారు. రూ.160 కోట్ల అంచనాతో మొదలు పెట్టిన వేణుగోపాల సాగర్‌కూ రూ.35 కోట్ల మేరకు పనులు జరిగాయి. కాలువ సహా వేపగుంట సాగర్, అడవికొత్తూరు రిజర్వాయర్ల అంచనా వ్యయం రూ. 129.8 కోట్లు కాగా, ఇందులో 75 శాతం పనులు పూర్తయ్యాయి. టన్నెళ్ల నిర్మాణానికి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు రాకపోవడంతో పెండింగులో పడ్డాయి. మిగిలిన రిజర్వాయర్ల నిర్మాణానికి భూసేకరణలో అటవీ శాఖ నుంచీ అనుమతులు రావాల్సి ఉంది.

నాడు శివాలెత్తి.. నేడు నోరెత్తని వైసీపీ నేతలు

వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. గాలేరు- నగరి ప్రాజెక్టు రెండో దశ పనుల కోసం నగరి ఎమ్మెల్యే రోజా ఆందోళన నడిపారు. ఈ ప్రాజెక్టు వల్ల శ్రీకాళహస్తి నియోజకవర్గానికీ లబ్ధి ఉంది. అందుకని ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు అప్పట్లో వైసీపీ నేత బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆందోళనలు చేపట్టారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి కూడా గట్టిగా నినదించారు. తద్వారా 2019 ఎన్నికల్లో ఈ ముగ్గురూ ఎమ్మెల్యేలుగా గెలిచారు. వీరిలో రోజా మంత్రిగాను.. కరుణాకరరెడ్డి టీటీడీ ఛైర్మన్‌గానూ జిల్లాలో బలమైన అధికార కేంద్రంగా మారారు. మధుసూదన్‌రెడ్డి సీఎం జగన్‌కు సన్నిహితులు. ఇక, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఉన్న పలుకుబడి చెప్పక్కర్లేదు. ఇలా ప్రాజెక్టు కోసం నాడు ఆందోళన చేసిన వారు.. మిగతా ప్రజాప్రతినిధులూ ఐదేళ్లుగా నోరు మెదపడంలేదు.



పనులు ఆగిపోవడంతో తుప్పుపట్టిన కాంట్రాక్టు సంస్థ వాహనాలు

జగన్ ఏం చేశారంటే..


అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది పట్టించుకోలేదు.ఆ తర్వాత రూ.2500 కోట్ల విలువైన ప్రాజెక్టు పనుల టెండర్లను అర్ధంతరంగా రద్దు చేశారు. ఆ తర్వాత ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్పు పేరిట రూ.5013 కోట్ల అంచనాతో 2021 ఆగస్టులో ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. వీటికీ రెండున్నరేళ్లుగా అనుమతులు ఇవ్వలేదు. రద్దు చేసిన టెండర్ల స్థానంలో ఇంతవరకు రీ టెండర్లూ పిలవలేదు. ఒక్క రూపాయీ ఖర్చు పెట్టలేదు. బాలాజీ రిజర్వాయర్ సైట్ వద్ద కాంట్రాక్టు సంస్థ నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకోగా.. వాహనాలన్నీ తుప్పుపట్టిపోయాయి.

ఇదీ ఐదేళ్లలో సీఎం జగన్ సాధించిన 'గాలేరు- నగరి' ప్రాజెక్టు పురోగతి.

● వర్తమానం

చంద్రగిరి సీను మారింది





వైసీపీ అభ్యర్థికీ సీనియర్ నేతలకూ నడుమ అంతరం

పెరుగుతున్న టీడీపీ గ్రాఫ్

చెవిరెడ్డి దూరమైన లోటు స్పష్టం

చంద్రబాబు స్వస్థలం... చెవిరెడ్డి వైవిధ్య రాజకీయం... వెరసి చంద్రగిరి నియోజకవర్గం రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. కానుకలు, సాయాల భారీ ఖర్చుతో నిరంతరం జనం మెప్పుకోసం ప్రయత్నించిన చెవిరెడ్డి అనూహ్యంగా తప్పుకోవడంతో నియోజకవర్గంలో పరిస్థితులు తారుమారు అయ్యాయి. తొలిసారి శాసనసభ బరిలోకి దిగుతున్న తనయుడు మోహిత్‌రెడ్డిని దగ్గరుండి గెలిపించుకునే అవకాశం చెవిరెడ్డి ఒంగోలు ఎంపీగా ఆయన పోటీ చేయాల్సిన అనివార్యతతో కోల్పోయారు. ఈ పరిణామాలన్నీ టీడీపీ అభ్యర్థిగా మరోమారు బరిలోకి దిగుతున్న పులివర్తి నానీకి కలిసివచ్చాయి. ఆయన గ్రాఫ్ విపరీతంగా పెరుగుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీలో పెరిగిపోతున్న అసంతృప్తి

చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ శ్రేణుల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. గత ఎన్నికల్లో శక్తికి మించి పనిచేసినా నిరాదరణకు గురయ్యామని వీరు ఆవేదనతో ఉన్నారు. చెవిరెడ్డి నియోజకవర్గంలో ఉన్నంతకాలం దీనిని దాచుకున్న వీరంతా ఇప్పుడు బయటపడుతున్నారు. పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారు. గత ఐదేళ్లలో పనులు జరగకపోవడం, ఆదాయం లేకపోవడం, గుర్తింపు గానీ, పదవులు గానీ దక్కకపోవడం వంటివి కారణమవుతోంది. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పోటీ నుంచి తప్పుకున్నప్పటి నుంచే పట్టు సడలుతూ వచ్చింది. ఎక్కువ కాలం తాడేపల్లిలో వుంటూ శ్రేణులకు అందుబాటులో లేకుండా పోయారు. మోహిత్‌రెడ్డి వయసు తక్కువ కావడం, తొలిసారి పోటీ చేస్తుండడంతో అతని కంటే వయసులో పెద్దవారు, సీనియర్లు చొరవగా కలవలేకపోతున్నారు. దీంతో అభ్యర్థికీ, సీనియర్ నాయకులూ కార్యకర్తలకూ నడుమ అంతరం పెరిగింది. ఒంగోలుతోనే సతమతం అవుతున్న చెవిరెడ్డి చంద్రగిరిమీద ఇప్పట్లో దృష్టిపెట్టే అవకాశం లేదని తేలిపోయాక పార్టీ నీరసపడింది.

టీడీపీలోకి వలసలు

నియోజకవర్గంలో ప్రతిరోజూ ఏదో ఒక చోట వైసీపీ నుంచీ పెద్ద ఎత్తున కార్యకర్తలు, గ్రామ స్థాయి నాయకులు టీడీపీలో చేరుతున్నారు. మండల స్థాయిలో ప్రభావం చూపగలిగిన పలువురు నాయకులు వీరిలో ఉండడం విశేషం. చంద్రగిరి మండలం మాజీ జడ్పీటీసీ సరిత భర్త రమణమూర్తి, చంద్రగిరి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి , పాకాల జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఆమె భర్త బాబురెడ్డిలు, చిన్నగొట్టిగల్లులో వైస్ ఎంపీపీ సునీత, భర్త దామోదర్, రామచంద్రాపురం మండల నేత నీలకంఠ చౌదరి తదితరులు వైసీపీ వీడి టీడీపీలో చేరారు. ఈ పరిణామాలు వైసీపీని గణనీయంగా నష్టపరుస్తున్నాయి.

కాంగ్రెస్‌తో వైసీపీకి నష్టమే!

ఇక చంద్రగిరి నుంచీ ఆర్ఎంపీ వైద్యుడు వాసు కాంగ్రెస్ అభ్యర్థిగా రెండవసారి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత కంచన వేణుగోపాల్‌రెడ్డి కనుక గట్టిగా పనిచేస్తే ఆ మేరకు వైసీపీకి నష్టం కలిగే అవకాశముంది. వేణుగోపాల్‌రెడ్డికి ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో పట్టుంది. ఆయన పట్టుదలగా కాంగ్రెస్ అభ్యర్థి కోసం రంగంలోకి దిగితే ఈ రెండు మండలాల్లో వైసీపీ ఓట్లు గణనీయంగా చీల్చగలరు.

పుంజుకుంటున్న పులివర్తి నాని

టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ, ఆయన సతీమణి సుధారెడ్డి, కుమారుడు వినీల్.. ముగ్గురూ తలోవేపు నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. నానీ గత ఎన్నికల్లో ఓడిపోయాడన్న సానుభూతి జనంలో కనిపిస్తోంది. నిదానంగా టీడీపీ బలం పుంజుకుంటున్న దృశ్యం కనిపిస్తోంది. ఇటీవల ప్రముఖ రియల్టర్ డాలర్స్ దివాకర్‌రెడ్డి కూడా చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. నానీని గెలిపిస్తే చంద్రగిరి అభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో పలుచోట్ల ప్రకటించారు. మరోవైపు జనసేన, బీజేపీ పార్టీలు తమ పరిధిలో పూర్తి స్థాయిలో టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తున్నాయి. తాజాగా బుధవారం వంగవీటి రాధా చంద్రగిరికి వచ్చి బలిజ సామాజికవర్గంతో సమావేశమై ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థుల విజయానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. సమావేశానికి వేలాదిగా బలిజలు హాజరు కావడం చూస్తే ఆ సామాజికవర్గం కూడా గణనీయమైన స్థాయిలో టీడీపీకి మద్దతిస్తున్నట్టు భావించాల్సి వస్తోంది. ఈ అంశాలన్నీ టీడీపీకి సానుకూలతలను పెంచుతున్నాయి.



ఇంటి నుంచే ఓటు

- 32,421మందికి అవకాశం
- దివ్యాంగులు, 85 ఏళ్లు దాటినవారికి పోస్టల్ బ్యాలెట్
- ఫారం-12డీ ద్వారా దరఖాస్తు చేసుకుంటే చాలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 17: దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. ఇటువంటి వారు జిల్లాలో 32,421మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరంతా ఎన్నికల అధికారులకు 12డీ దరఖాస్తు చేసుకుంటే ఈ సౌలభ్యం కల్పిస్తారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 17,94,733 మంది (పురుషులు 8,74,738మంది, మహిళలు 9,19,817మంది) ఓటర్లు ఉన్నారు. వీరిలో.. దివ్యాంగ ఓటర్లు 24,481 మంది, 85 సంవత్సరాలు దాటినవారు 7,940మంది ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఇందులోనూ వందేళ్లు పైబడిన వారు 20మంది ఉన్నారు. వీరికి ఇంటి నుంచే ఓటు వేయడంపై అవగాహన కల్పించడానికి హోం ఓటింగ్ నోడల్ అధికారిగా భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమల్లీశ్వరరావును జిల్లా ఎన్నికల అధికారి నియమించారు.

దరఖాస్తు చేయడమిలా..

అర్హులైన దివ్యాంగులు, వృద్ధుల ఇంటికే వెళ్లి ఫారం- 12డీని ఎన్నికల అధికారులు అందజేస్తారు. ఈ ఫారాన్ని పూర్తి చేసి బీఎల్వోలకు ఇస్తే.. వారు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేస్తారు. దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాకే అర్హులైన ఓటర్ల ఇంటికి పోస్టల్ బ్యాలెట్‌ను పంపుతారు. వీరిలో ఎవరైనా తాము పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేస్తామని చెబితే ఫారం-12డీ ఇవ్వరు.

రహస్య పద్ధతిలోనే ఓటింగ్

ఓటర్ల నివాసానికి ఎన్నికల సిబ్బంది వ్యాన్‌లో చేరుకుంటారు. ఇద్దరు పోలింగ్ అధికారులు, ఓ వీడియోగ్రాఫర్, పోలీస్‌శాఖ నుంచి ఒకరుంటారు. అక్కడ ఓటరుకు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. అధికారులు నిర్దేశించిన పోలింగ్ కంపార్ట్‌మెంట్‌లో రహస్యంగా ఓటు వేసి, దాన్ని బ్యాలెట్‌బాక్సులో ఓటరు వేసేలా చర్యలు తీసుకుంటారు. ఎవరికి ఓటు వేశారన్న విషయాన్ని తప్ప, మిగిలిన ప్రక్రియనంతా అధికారులు చిత్రీకరిస్తారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.